

# ఎన్నాళ్లో వేచిన ఉదయం

ఆదూరి వెంకట సీతారామమూర్తి

"మరొక్కసారి ఆలోచించి ఏ సంగతీ చెబితే సంతోషంగా వెళ్ళిపోతాం" అంది పెళ్ళి కూతురి తల్లి వర్ధనమ్మగారి వంక చూస్తూ.

ఒక క్షణం ఎవ్వరూ ఏం మాట్లాడలేదు—ఇక తప్పదన్నట్లు వర్ధనమ్మే అంది—

"ఏముంది వదినగారూ చెప్పడానికి. అబ్బాయికి పిల్ల నచ్చింది. మీకు అబ్బాయి నచ్చేడు. ఇక కట్నకానుకల విషయమై మావాడికున్న అభిప్రాయం మీకు స్వయంగానే చెప్పాడు. నే నిందులో వేరే ఆలోచించేదీ, చెప్పగలిగేదీ లేదు."

"అలా మీరు బిగుసుకు కూర్చుంటే న్యాయమా చెప్పండి. మీరు మా సంగతి ఆలోచించాలి. ఒక ఆడపిల్ల పెళ్ళి చెయ్యాలంటే ఈ రోజుల్లో ఎంత కష్టమో మీకు తెలియంది కాదు—రెండో పిల్లకీ పెళ్ళి కుదిరింది—కట్నం అయిదువే లిస్తున్నాం—కాదూ కూడదూ అంటే మరో వెయ్యి ఇచ్చుకోగలం—అదీ అతి కష్టంమీద. మీరందుకంగీకరిస్తే ఒక పిల్ల పెళ్ళి కాదు—ఇద్దరు పిల్లల పెళ్ళిళ్ళూ మీరే చేసినవారవుతారు" అంటూ రాజమూర్తి ముఖంలోకి చూసింది పెళ్ళి కూతురు తల్లి.

రాజమూర్తి ఇల్లస్ట్రేటెడ్ వీక్లీలోంచి తలెత్తలేదు—మారు పలకనూ లేదు.

ఇక లాభం లేదనుకున్న అవధానిగారు గొంతు సవరించుకుని, "చూడబ్బాయ్. నువ్వే ఏదో కనికరించి చెబితేనేగాని సంబంధం అతికేటట్లు లేదు. వాళ్ళు మెట్లు ఎక్కివచ్చారు. నువ్వో రెండు మెట్లు దిగితే అందరికీ శుభం అవుతుంది" అన్నారు.

ఈసారైనా రాజమూర్తి తలెత్తాడు—

అతని ముఖంలో ఏ భావమూ లేదు.

"చూడండి అవధానిగారూ. నా అభిప్రాయాలన్నీ మీకు స్పష్టంగానే చెప్పాను. ఇందులో మిమ్మల్ని కనికరించాల్సిందీ, నేను దిగి రావల్సిందీ ఏం లేదు—మీ కిష్టమైతే ఇవ్వండి. లేదా మీ అమ్మాయికి మరో సంబంధమవుతుంది. కట్నాలు తీసుకోకుండా పెళ్ళిళ్ళు చేసుకుంటామని బాహాటంగా చెప్పుకునే వాళ్ళు ఈ రోజుల్లో చాలా మంది ఉన్నారు. నేను వాళ్ళ కోవకు చెందను. నా తర్వాత పెళ్ళి కెదిగిన ఇద్దరు చెల్లెళ్ళున్నారు. ఈ రోజు నేను కట్నకానుకలకు ఆశించకుండా పెళ్ళి చేసుకున్నా రేపు వారికి కట్నమిచ్చి పెళ్ళి చేసే పరిస్థితి తప్పుతుందని నే ననుకోను. సమాజంలో మార్పు రావాలనీ, కట్నాల దురాచారాలు తొలగి పోవాలనీ నేనూ కోరుకుంటాను. కానీ మన కొచ్చే మార్పంతా కాగితాల మీద అక్షరాల రూపంలోనే ఉండిపోతూంది గాని ఆచరణలోకి రావటం లేదు. వచ్చినా నూటికి ఒకటో, అరో. అదికూడా ప్రేమ పెళ్ళిళ్ళే. కాబట్టి నా నిర్ణయంలో మార్పు లేదు — ఎనిమిదివేలు మీకు ఎక్కువే అవచ్చు. కానీ నా కందులో మిగిలేదేం లేదు.

మీ సంప్రదాయం ప్రకారం మీరిచ్చే కట్నంలో సగమో మూడోవంతో లేదా పూర్తిగానో పిల్లకి పెట్టే బంగారం కోసం, చీర కోసం ఖర్చు పెట్టాలి. ఇంకా లాంఛనాలూ, పురోహితుడి కట్నం, సన్నాయి మేళం—అప్పులకేకాక వారి బంధు

మిత్రు సపరివారానికి విందులు, భోజనాలు—

ఇవన్నీ సంప్రదాయం పేర మనం చేస్తున్న దుబారా కాదూ? మీ కివన్నీ యథావిధిగా ఉండాలి. పెళ్ళి కొడుకు కట్నం తీసుకోవాలనే సంప్రదాయం కూడా మీ కుంది—అందుకోసమే 'ఇంతిస్తాం' అని ఎర చూపుతారు. బేరాలాడతారు. ఒకవేళ పెళ్ళికొడుకు నవ్యభావాలు కలవాడై కట్నం తీసుకోనంటే ముక్కుల మీద వేలేసుకుంటారు. లోపాలున్నాయని అనుమానపడతారు.

అందుచేత మీరు మీసంప్రదాయం ప్రకారం చేయాలనుకున్నా నాకేం అభ్యంతరం లేదు—దండల పెళ్ళి జరిపిస్తామన్నా మరింత సంతోషం. నాక్కావల్సింది చెప్పానుగా. అంతే! ఆ పైన మీరే ఆలోచించుకోండి'' అంటూ గుక్క తిప్పుకోకుండా చెప్పవలసినవన్నీ చెప్పేసి లేచి బయటకు వెళ్ళిపోయాడు రామమూర్తి.

• • •

''మీతో ఒక పది నిముషాలు మాట్లాడాలను




లింటాస్–BBC.DLT.6-203 TL

కుంటున్నాను. అభ్యంతరమా?''

ఎవరివో మాటలు విన్పిస్తే వెనక్కు తిరిగి చూశాడు రాజమూర్తి.

రాధ!

తనకోసమే చూస్తున్నట్లుంది.

''నిరభ్యంతరంగా'' అన్నాడు రాజమూర్తి.

ఇద్దరూ దగ్గర్లో ఉన్న పార్కువైపు నడక సాగించారు.

''మీరు నన్ను పెళ్ళి చేసుకుంటారనుకున్నాను'' అంది పార్కులో బెంచీ మీద కూర్చుంటూ.

''నేనూ అలాగే అనుకున్నాను. కాని మీ వాళ్ళే పడనిచ్చేట్టు లేరు'' అన్నాడు రాజమూర్తి.

''డబ్బుకోసమేగా నేను మీ కక్కరలేకపోయింది!''

ఈ మాటలు కాస్త పదునుగానే వచ్చాయి.

రాజమూర్తికి అవకాశం రానే వచ్చింది.

''అవును, నాక్కావలసింది డబ్బే—ఆ మాటకొస్తే డబ్బు అక్కర్లేందెవరికి? డబ్బు కోసం ఉద్యోగం చేస్తాం. డబ్బుకోసం పెళ్ళిళ్ళు చేసుకుంటాం. డబ్బు కోసం మోసాలు చేస్తాం—హత్యలు చేస్తాం. మనం టోపీలు వేసుకూంటూ ఎదుటివాళ్ళకి టోపీలు వేస్తాం—ఇంకా కటువుగా చెప్పాలంటే డబ్బు కోసం బొడ్డూడని ఆడపిల్లల్ని అమ్ముకున్న దేశం మనది—డబ్బుకోసం ఈ దేశం ఆడబడుచుల్ని పై దేశానికి చాటుగా ఎగుమతి చేసే జాతి మనది!

నాకు డబ్బు విలువ తెలుసు—డబ్బు లేని మనిషి విలువా తెలుసు. ఆకలి, పేదరికం—వీటి విలువలు అంతకంటే బాగా తెలుసు—డబ్బు కట్టందే నాకు విద్య రాలేదు—డబ్బు కట్టందే నాకు ఉద్యోగం రాలేదు. డబ్బు లేందే నా కడుపులోకి ముద్ద దిగలేదు.

అటువంటి డబ్బును నే నెందుకు ప్రేమించ కూడదు? నే నెందుకు కావాలని కోరుకోకూడదు? డబ్బే లేకపోతే నాకు చదువే లేదు. ఈనాడీ ఉద్యోగమూ లేదు. అప్పుడే కట్నా లెరచూపి పిల్లనిస్తామని చుట్టూ తిరిగే వాళ్ళూ ఉండేవారు కాదు.

ఆ మాటకొస్తే ఉద్యోగం లేని మగాన్ని పెళ్ళాడ్డానికి సిద్ధపడే వాళ్ళెంతమంది పెళ్ళి కాలేదని బాధ పడే ఈ ఆడపిల్లల్లో—

ఇవన్నీ మీకు తెలుసు. నేను చేసుకోనంతమాత్రాన మీకు పెళ్ళి కాకపోదు. మీ రిచ్చేదానికి ఆశపడి మీ వెనకాల తిరిగేవాళ్ళు ఇంకా చాలా మంది ఉంటారు. అలాగే నాక్కావల్సింది ఇస్తా బతిమాలుతూ నా చుట్టూ తిరిగే వాళ్ళూ ఉండొచ్చు'' అని ఆగి, రాధ ముఖంలోకి చూశాడు రాజమూర్తి, ఇంకా ఏవైనా అడగవలసిన ప్రశ్నలున్నాయా అన్నట్టు.

''అయితే లోకం మీద మీకున్న కసినంతా నా మీద చూపిద్దామనుకున్నారన్నమాట'' అంది రాధ నవ్వుతూ.

రాజమూర్తి ఆ పరిస్థితిని వూహించలేదు—ఆమె ఇంకా గంభీరంగా నీతులు వల్లిస్తుందేమో ననుకున్నాడు. చదువుకున్నది కాబట్టి ''కట్నం తీసుకుంటున్న చవటా'' అని మెత్తగా చీవాట్లేస్తుందేమో నన్నుకున్నాడు. సంబంధం తప్పిపోతుందన్న ఉక్రోషంతో, కోపంతో శపిస్తుందనుకున్నాడు.

కానీ తను చెప్పిందంతా విని నవ్వుతూ గోముగా సమాధానం చెప్పేసరికి రాజమూర్తి నిజంగా ఆశ్చర్యపోయాడు.

''కసి కాదు. ఉన్న నిజమే. అయినా అది మీ మీ దెందుకు చూపుతాను?'' అన్నాడు తనూ నవ్వడానికి ప్రయత్నిస్తూ.

''అయితే మీరు మరోలా అనుకోకపోతే ఒక్క విషయం చెప్పాలి. మా పరిస్థితుల్ని బట్టి మావాళ్ళు నిజంగా మీ రడిగింది ఇచ్చే స్థితిలో లేరు—ఇటు సంబంధాన్ని వదులుకోనూలేరు. నాగురించి వాళ్ళంతగా బాధ పడుతున్నప్పుడు నా భవిష్యత్తు గురించి నేనూ కొంచెం ఆలోచించాలి. అందుకే మీ దగ్గరకొచ్చాను'' అని ఆగి, రాజమూర్తి కళ్ళలోకి చూసింది.

''చెప్పండి. మరేదైనా సహాయమా'' అన్నాడు.

''నా సేవింగ్స్‌లో రెండు వేల వరకూ ఉంది. ఆ సంగతి మా వాళ్ళకు తెలీదు. రేపు ఎలాగూ అది మీకే చెందుతుంది కాబట్టి ఈ రోజే అది మీకివ్వగలను. పోతే—మీరు చేయవలసిన పనొక్కటే. . .''

ఆ మాటకు అయోమయంగా రాధ కళ్ళలోకి చూశాడు రాజమూర్తి.

''మరేం లేదు. మావాళ్ళకీ విషయం తెలియకుండా వాళ్ళు చెప్పిందానికే మీ రొప్పుకున్నట్టు కబురు చెయ్యా లంతే.''

వెంటనే ఏ భావాన్నీ ప్రకటించ లేదు రాజమూర్తి.

తనలో లేని సంస్కారాన్ని, మంచిని ఉన్నట్టు చూపమనా ఆమె ఉద్దేశం? లేక, 'నువ్వెటూ' దిగ లేక పోయావ్—నేనే వచ్చాను నీ కోసం, నా డబ్బును కూడా త్యాగం చేసి' అని చెప్పటమా!?

ఈ రెంటిలో ఏదైనా తప్పు. ఏదీ కాకనూ పోవచ్చు. తనకేం? తనకు డబ్బు కావాలి. తనక్క వచ్చిన రాధ కూడా కావాలి.

''మీరు మనఃస్ఫూర్తిగా నన్ను చేసుకోడానికి ఇష్టపడితే నా కభ్యంతరం లేదు''. అన్నాడు.

''ఏ స్త్రీ ఈ విషయంలో ఇంతకంటే ఎక్కువ చెప్పగలదు చెప్పండి?'' అంటూ సిగ్గుతో వాలిన కళ్ళతో అతని వంక చూసింది.

ఆ చూపులు కలిశాయి.

ఆ తర్వాత మనసులూ కలిశాయి.

రాధమ్మ పెళ్ళికూతురాయెనే. . .

• • •

''నీ దృష్టిలో డబ్బు మనిషిగానే స్థిరపడ్డా ఒక విషయం నీ దగ్గర దాచకుండా ఉండలేక పోతున్నాను'' అన్నాడు రాజమూర్తి అతి కష్టం మీద గొంతు పెగుల్చుకుని.

''ఇంతకీ రాత్రంతా నిద్ర పోకుండా ఆలోచించేది దీని గురించేనా? చెప్పండి—నేను మీరనుకున్నంత అవివేకిని కాదు. ఆలోచించలేకపోడానికీ, అపార్థం చేసుకుందికీ. ఉన్నదున్నట్లు మాట్లాడే మనసు అంటేనే నా కిష్టం. అందుకే మీరు ఎట్టుటంగా ఉన్నా అప్పుడు మిమ్మల్ని చేసుకుందికి ఇష్టపడ్డాను. చేసుకున్నాను కూడా'' అని అతని దగ్గరగా జరిగి, అతని గుండె మీద చెయ్యేసి నిమిరింది రాధ—

''నువ్విచ్చిన పెళ్ళినవం నల్లపూసల పెళ్ళి యించి—ఈ రెండో కుంపటిని కూడా గుండె మీదించి దింపుకుంటే. . .'' రాజమూర్తి మాటలకి అడ్డొచ్చింది రాధ.

''ఛా. గీత పెళ్ళిగురించి మీరిలా అలా నిరుత్సాహ పడితే ఎలా? మీరు నమ్మరు. నా కా నమ్మకముంది.''

''ఏం నమ్మకమో! తల్చుకుంటే దిగులుగా ఉంది—పెళ్ళివారు నాలాగే పట్టుబట్టుక్కూర్చున్నారు.

పెళ్ళి ఖర్చుల కెలాగో అప్పు చేద్దామన్నా కట్నానికే మరో రెండు వేలు కావాల్సి వస్తోంది. ఈ విషయంలో నువ్వు సాయపడగలవనే నమ్మకం నాకుంది'' అన్నాడు.

''నేనా!'' ఆశ్చర్యపోయింది రాధ.

''అవును నువ్వే—అడగడానికే అభిమానం అడ్డొస్తోంది. నీ పెళ్ళికి మేం పెట్టిన బంగారం పద్మ పెళ్ళిలోనే అయిపోయింది. ఇంకా మావాళ్ళు నీకు పెట్టిన రెండు జతల గాజుల గురించి అడగాలంటే. . .'' రాజమూర్తి మాటలకు రాధ గుండె గుభేల్మంది— ఆ తర్వాత అతని మాట లామెకు విన్పించలేదు.

కాస్సేపయ్యాక తేరుకుని, ''మీరు నవ్వనంటే మీ కో విషయం చెప్పాలి. ఎప్పటికప్పుడు చెప్పాలనే అనుకున్నా కుదర లేదు'' అంటూ అసలు విషయాన్ని బయట పెట్టింది.

అంతా విని రాజమూర్తి అచేతనంగా ఉండి పోయాడు.

''అంటే. . .నువ్వు సేవింగ్స్ అని చెప్పి నా కిచ్చిన రెండు వేలూ నీ బంగారు గాజు లమ్మేనా? మరి ఇవి?''

''బంగారు పూత పూసిన గాజులు. మావాళ్ళకి తెలిస్తే బాధ పడతారు— నా క్కావలసింది బంగారు గాజులు కాదు; బంగారు భవిష్యత్తు.''

రాజమూర్తి మరేం మాట్లాడలేకపోయాడు.

బయట కాకులు కూస్తున్నాయి.

తూర్పు తెల్లవారడానికి ఇంకా ఎంతో సేపు లేదు.

ఇద్దరి మధ్య పరుచుకున్న నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ రాధే అంది:

''గీత పెళ్ళి విషయంలో నా కో అభిప్రాయ ముంది. వింటానంటే చెబుతా.''

ఏమిటన్నట్లు చూశాడు రాజమూర్తి.

''గీతకి మా రాఘవ్ అంటే విపరీతమైన ప్రేమ. తెల్సా?'' అంటూ ఆగింది.

''అర్థమైంది. మరి అతను ఇష్టపడతాడా?''

''ఆ విషయం నాకు వదిలెయ్యండి. వాడు నా ఇష్టానికీ, అభిప్రాయానికీ విలువిస్తాడు.'' మీ అభీష్టానికనువుగా పెళ్ళి చేసే బాధ్యత నాది.'' రాధ ఇంకా ఏదో చెబుతోంది.

రాజమూర్తి కేమీ వినిపించటం లేదు.

చక్కని మంగళవాద్యం. . . మామిడి తోరణాలతో, పువ్వులతో అలంకరించిన వేదిక...సుగంధ పరిమళాలు. . . అక్కడ కట్నాలు లేవు. . . లాంఛనాలు లేవు ... సణుగుళ్ళు లేవు ... పేచీలు లేవు. . . .అర్థం కాని మంత్రాలు లేవు.

అక్కడ ఇచ్చిపుచ్చుకునేవి మనసులు మాత్రమే—ఎన్నాళ్ళకు తన కలలు నిజమయ్యాయి!

ఈ రోజు చెల్లెలి పెళ్ళి. . .రేపు కొడుకు పెళ్ళి. . .ఆ తర్వాత. . .

.కట్నాలు తెంచుకున్న ఆనందంలో రాధను కౌగిట్లో బిగించాడు.

అప్పటికి తూర్పు తెల్లబడింది. ★